

వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో క్రీడా ప్రాంగణం కోసం స్థల పరిశీలన చేస్తున్న శివసేనారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి

● రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

వనపర్తి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రీడామైదానాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని, మర్రికుంట మెడికల్ కళాశాల వద్ద కొత్తగా హాకీ స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన, పెద్దగూడెం పరిధిలోని క్రీడా ప్రాంగణం, గ్రామ పక్కన ఉన్న మరో 3 ఎకరాల ఖాళీ స్థలాలను పరిశీలించారు. వనపర్తి జిల్లాలో దాదాపు రూ.25 కోట్ల వ్యయంతో క్రీడా మైదానాలు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ ఎంపికల పోటీలను తిలకించారు. అనంతరం మర్రికుంట మెడికల్ కళాశాల వద్ద హాకీ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. 12.5 ఎకరాల ఖాళీ స్థలం ఉండి పక్కనే మెడికల్ కళాశాల , కలెక్టరేట్ భవనం ఉండడం వల్ల ఖేలో ఇండియా పథకంలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో హాకీ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... రానున్న కాలంలో దేశంలో ఒలంపిక్ క్రీడల నిర్వహణకు వనపర్తి జిల్లాలోని క్రీడా మైదానాలు ఉపయోగపడే విధం గా జిల్లాలోని క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు క్రీడా మైదానాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్, టెక్నికల్ డైరెక్టర్ చంద్రారెడ్డి, కార్యనిర్వహక ఇంజనీరు అశోక్, పంచాయతీ రాజ్ శాఖ కార్యనిర్వహక ఇంజనీరు పాల్గొన్నారు.



పాదుకలకు పూజలు చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



జాతర మైదానంలో గుడారాలు వేసుకున్న భక్తులు



దాసంగాలతో నైవేద్యం పెడుతున్న భక్తులు



కురుమూర్తి ఉత్సవాలకు ఎద్దుల బండిపై వస్తున్న భక్తులు

గోవిందా.. గోవింద

- వైభవంగా ఉద్దాలోత్సవం
- భక్తసంద్రమైన కురుమూర్తి జాతర మైదానం
- స్వామివారి నామస్మరణతో మార్మోగిన కొండలు
- దర్శించుకున్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

పేదల తిరుపతిగా పేరొందిన మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉద్దాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం, జాతర మైదానం భక్తులతో కిక్కిరిసింది. చిన్నవడ్డెమాన్‌లోని ఉద్దాల మండపంలో ఉద్దాలకు ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పూజలు చేశారు. అనంతరం ఉద్దాల ఊరేగింపు ఊకచెట్టు వాగు మీదుగా ఆరు గంటల సమయంలో కురుమూర్తి ఆలయానికి చేరుకున్నది. ఆ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణ మారుమోగింది.

- చిన్నచింతకుంట, ఆంధ్రజ్యోతి

7



కురుమూర్తి వేంకటేశ్వర స్వామి జాతర మైదానంలో కిక్కిరిసిన భక్తులు

సర్వర్ డౌన్

- నిర్మాణ రంగ కార్మికులకు తప్పని అవస్థలు
- 60 రోజులు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 48వేల మంది కార్మికులు
- పథకాల అమలు కోసం ఎదురుచూపులు

6



భవన నిర్మాణానికి ఇసుక మోస్తున్న కూలి

కొండారెడ్డిపల్లిలో.. ఆధ్యాత్మిక శోభ

- వైభవంగా విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన
- పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత, సోదరులు, కలెక్టర్ బదావత్ సంతోష్



విగ్రహాల ప్రతిష్ఠపూజలో సీఎం సతీమణి గీత

6

అనాథగా జీవించలేక యువకుడి ఆత్మహత్య

● జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో ఘటన

7

మానవ విలువలతో కూడిన విద్య అందించాలి

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

7

మృతదేహంపై ఆభరణాలు మాయం

» పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

అక్రమార్జనే ధ్యేయం

- ప్రభుత్వ కార్యాలయాల్లో పెరుగుతున్న లంచావతారులు
- ఏసీబీ దాడుల్లో పట్టుబడుతున్నా మారని ఉద్యోగులు
- తాజాగా ఏసీబీకి పట్టుబడ్డ గద్వాల ఇన్‌చార్జి డీఈవో వ్యవహారంపై చర్చ !



గురువారం ఏసీబీకి చిక్కిన గద్వాల ఇన్‌చార్జి డీఈవో రవీందర్

అయిజటౌన్: నవంబరు 8, (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి నిలయాలుగా మారుతున్నాయి. ప్రజలకు ఏ పని కావాలన్నా కార్యాలయాల్లో చేతులు తడపాల్సిన పరిస్థితులు ఉన్నాయంటే ఆయా కార్యాలయాల్లో పనిచేసే కొందరు ఉద్యోగులు ఎంత అవినీతికి అలవాటు పడ్డారో అర్థం చేసుకోవచ్చు. ప్రతినిత్యం వివిధ రకాల పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామన్యుడి నుంచి కోటీశ్వరుడి వరకు చేతులు తడపందే ఫైళ్లు కదలవనేది అక్షర సత్యంగా మారింది. ఏసీబీ దాడుల్లో పట్టుబడినా లంచావతారుల తీరు మాత్రం కుక్క తోక వంకర అన్న చందంగా ఉంది. తాజాగా గద్వాల జిల్లాకు ఇన్‌చార్జి విద్యాధికారిగా వ్యవహరిస్తున్న రవీందర్ గురువారం రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ విషయం చర్చనీయాంశం అయ్యింది. లంచం తీసుకోవటం నేరం అని బడు ల్లోని చిన్నారులకు విద్యాబుద్ధులు చెప్పే విద్యావస్థలోనే డీఈవో స్థాయి అధికారి లంచం తీసుకోవటంపై విస్మయం కలుగుతుంది. ఈ విధంగానే అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెరిగి, కార్యాలయాలకు సామాన్యులు రావాలంటేనే లంచం ఇవ్వాలనే భావన ఉంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా ఏసీబీకి పట్టుబడ్డ ఉద్యోగులు మచ్చుకు కొందరు...

2022 సంవత్సరం జనవరిలో మరికల్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి 1 ఎకరం ఏడు గుంటల భూమిని విరాసత్ చేసేందుకు రూ. 20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. అదే ఏడాది ఏప్రిల్ నెలలో కల్వకుర్తి విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ అధికారి ట్రాన్స్‌ఫార్మర్ పనికోసం ఒక లక్ష రూపాయలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.

2024 సంవత్సరం జనవరిలో అయిజ పట్టణంలో ఇంటిముందు ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించేందుకు రూ.20 వేలు లంచం తీసుకుంటూ విద్యుత్ ఉద్యోగి ఒకరు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఇదే నెలలో కల్వకుర్తి ఆర్‌డీవో కార్యాలయంలో ఓ ఉద్యోగి భూమి పంచనామా చేసిన పత్రాలు రైతుకు అందించేందుకు రూ. 8 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. అదే ఏడాది ఫిబ్రవరి నెలలో మహబూబ్‌నగర్ పురపాలిక శాఖలో ఒక ఉద్యోగి రెండు పనులకు ఎంబీలు చేసేందుకు రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికారు. మార్చిలో నారాయణపేట జిల్లా, గుండుమాల్ తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగి ఒకరు రైతు వద్ద మూడు వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. జూన్ నెలలో వనపర్తి జిల్లాకు చెందిన విద్యుత్ అధికారుల ముగ్గురు కొత్తకోట మండలానికి చెందిన రైతువద్ద ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ, 19 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికారు. ఉన్నతాధికారులు వారి కిందిస్థాయిలో పనిచేసే ఉద్యోగులతో లంచండిమాండ్ చేసి, అగ్రిమెంట్ కుదుర్చుకున్న తరువాత పనిచేయించుకున్న అనంతరం వ్యక్తులు, వ్యాపారులు నుంచి డబ్బులు వసూలుచేయిస్తారనే ప్రచారం ఉంది. చిన్న ఉద్యోగి అయినా, పై స్థాయి ఉద్యోగి అయినా లంచం తీసుకోవటం నేరము కాబట్టి చట్టం పరిధిలో కఠినంగా శిక్షింపబడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల్లో అవగాహన పెరగాలి

అవినీతిని అంతమొందించే విషయంపై ప్రజలల్లో అవగాహన పెరగాలి. ఇప్పుడిప్పుడే ప్రజలు చైతన్యం అవుతున్నారు. ఇంకా చైతన్యం కావలసిన అవసరం ఉంది. గతేడాదికంటే ఈ ఏడాది కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ప్రజలు అవినీతిని వ్యతిరేకిస్తున్నట్లుగా స్పష్టమవుతోంది.

- కృష్ణగౌడు, ఏసీబీ డీఎస్పీ



బాలికల విభాగంలో తలపడుతున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి జట్లు

అట్టహాసంగా బాస్కెట్‌బాల్ టోర్నీ

» మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల పోటీలు ప్రారంభం

6

పత్తి లోడ్ డీసీఎం దగ్ధం



యాసంగి సాగుకు సన్నద్ధం

- గద్వాల జిల్లాలో సాగు అంచనా 1.30 లక్షల ఎకరాలు
- వనపర్తి జిల్లాలో 1,31,876 ఎకరాలు
- ఈ ఏడాది పెరుగనున్న వరి, మొక్కజొన్న, పొగాకు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు



జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలో సాగుచేసిన పప్పుశనగ



వనపర్తి మండలం కాశీంనగర్ తండా సమీపంలో విత్తనాలు వేస్తున్న రైతులు (ఫైల్)

గద్వాల/వనపర్తి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలో యాసంగి సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. వ్యవసాయ అధికారులు కూడా ఎరువులు, విత్తనాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. గద్వాల జిల్లాలో సుమారు 1.30లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగు అవుతాయని అంచనా వేశారు. అందుకు అనుగుణంగా 28,763 క్వింటాళ్ల విత్తనాలు, 34,280 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు.

వనపర్తి జిల్లాలో 1,31,876 ఎకరాలలో సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది పత్తి మినహా అన్ని పంటలు ఆశాజనంగా దిగుబడులు వస్తున్నాయి. యాసంగిలో కూడా పంటలు బాగా పండుతాయని రైతులు ఆశతో సాగుచేస్తున్నారు.

జూరాల ప్రాజెక్టులో యాసంగి పంటకు కావాల్సిన నీరు అందుబాటులో ఉండటంతో గద్వాల జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది వరిసాగు పెరిగే అవకాశం ఉంది. గతేడాది 52వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ఈ ఏడాది 61వేల ఎకరాలలో సాగు అవుతోందని అధికారులు అంచనా వేశారు. మొక్కజొన్న 19,272 ఎకరాల్లో, జొన్న 3,402 ఎకరాలు, పొగాకు 5,200ఎకరాలు, వేరుశనగ 12,850ఎకరాలు, పప్పుశనగ 13,731 ఎకరాలు, మినుములు 5,203 ఎరాలు, కందులు 350 ఎకరాలు, ఆముదం 182 ఎకరాలు, అలసందలు 859ఎకరాలు, కొర్రలు 260ఎకరాలు, కూరగాయలు 5,907 ఎకరాలు, ఇతర పంటలు సాగుచేసే అవకాశం ఉందని అధికారుల అంచనా.. గద్వాల జిల్లాలో యాసంగికి యూరియా 10,220 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4,990, పొటాష్ 1,850, కాంప్లెక్స్ ఎరువులు 14,890, సూపర్ ఫాస్పేట్ 1,750 ఇలా మొత్తం 34,280 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేసి అందుబాటులో ఉంచారు.

వనపర్తి జిల్లాలో భూగర్భ జలాలు పెరగడంతో బోరు బావుల్లో నీరు పుష్కలంగా లభిస్తుంది. దీంతో యాసంగిలో 1,31,876 ఎకరాలలో

- మిగతా 6వ పేజీలో..

యువరైతు దారుణ హత్య

- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు
- డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో దర్యాప్తు



రాజునాయక్ (ఫైల్)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వెల్దండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంటచేను కాపలాగా వెళ్లిన యువ రైతు దారుణహత్యకు గురైన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే... నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని ఎంజీ కాలనీ తండాకు చెందిన రాత్లావత్ రాజునాయక్ (30) తన భార్య హిమబిందుతో కలిసి గురువారం రాత్రి తమ వేరుశనగ పంటకు కాపలాగా వెళ్లారు. ఈ క్రమంలో తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో తన భర్త కనిపించకపోవడంతో పక్క పొలంలో ఉన్న రాజునాయక్ సోదరుడైన లాలునాయక్, అతని భార్య లక్ష్మికి తెలిపింది. వారు ముగ్గురు కలిసి పొలంలో వెతికారు. సమీపంలోనే రాజునాయక్ మృతదేహం కనిపించింది. విషయాన్ని తండావాసులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తిలు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి ముఖంపై రాయి, సుత్తి వంటి ఆయుధాలతో కొట్టి హత్య చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలతో విచారణ జరిపారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థులు

హన్వాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ జిల్లాలో ఈ నెల 10 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 6న జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో మండలంలోని గొండ్యాల జడ్పీహెచ్‌ఎస్ 10వ తరగతి నందిని, తొమ్మిదో తరగతి పవిత్ర, రామ్‌చరణ్, నరహరి ఎంపికైనట్లు పీడీ జగన్‌మోహన్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. వారిని పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం వెంకటేష్, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



రెజ్లింగ్ జట్టుతో డీఈవో, సిబ్బంది

రెజ్లింగ్ పోటీలకు వెళ్లిన క్రీడాకారులు

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలుర రెజ్లింగ్ పోటీలకు హైదరాబాద్‌కు ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు శుక్రవారం తరలివెళ్లింది. ఈ సందర్భంగా స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయం దగ్గర డీఈవో అబ్దుల్ ఘనితో సిబ్బంది రెజ్లింగ్ (కుస్తీ) రాష్ట్ర స్థాయి పోటీలు హైదరాబాద్ జియాగూడ హనుమాన్ వ్యాయామశాలలో శని, ఆదివారాల్లో రెండు రోజులు జరుగుతాయని ఈ పోటీల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు తీసుకోవాలని ఆకాంక్షించారు. సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి, ఏఎంవో విద్యాసాగర్, జీసీడీవో పద్మనళిని, నర్సింములు, సాయినాథ్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● నారాయణపేట జిల్లా గుడెబల్లూరు శివారులో ఘటన

కృష్ణ, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా గుడె బల్లూరు గ్రామ పంచాయతీ శివారులో శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వ్యక్తి రోడ్డుపై నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని భారీ వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ నవీద్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృత దేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అట్టహాసంగా బాస్కెట్‌బాల్ టోర్నీ

● మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల పోటీలు
● పాల్గొన్న ఉమ్మడి పది జిల్లాల 240 మంది క్రీడాకారులు
● ఆటల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు : డీఐఈవో కౌసర్‌జహాన్



పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ జిల్లాల క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 8: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కౌసర్‌జహాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మెదక్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లా నుంచి 240 మంది పోటీల్లో తలపడుతున్నారు. ఈ సందర్భంగా కౌసర్ జహాన్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రాష్ట్ర సచివాలయంలో 70 శాతం మంది ఉద్యోగులు క్రీడా కోటలో ఉద్యోగాలు పొందారని గుర్తు చేశారు. తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా టోర్నీలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల స్థాయిలోనే క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతిభ చాటి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని అన్నారు. మూడో రోజుల పాటు క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో బాస్కెట్‌బాల్ టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపికలు పారదర్శకంగా నిర్వహిస్తామని, క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా వసతి, బస కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టోర్నీ రాష్ట్ర పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి, పీడీ ముకురం, బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా సెక్రటరీ హైదర్‌అలీ, సూపరింటెండెంట్ సాదిక్‌అలీ, కోచ్ ఖలీల్, వ్యాయమ ఉపాధ్యాయులు అరుణ జ్యోతి, నాగరాజు పాల్గొన్నారు.



తలపడుతున్న బాలికలు

మహబూబ్‌నగర్ శుభారంభం

బాస్కెట్ బాల్ బాలికల విభాగంలో మొదటి రోజు మహబూబ్‌నగర్ జట్టు రంగారెడ్డిపై 14-11 స్కోర్‌తో శుభారంభం చేసింది. ఖమ్మం జట్టు కరీంనగర్‌పై 29-01 తేడాతో గెలిచింది. బాలుర విభాగంలో హైదరాబాద్ జట్టు వరంగల్‌పై 27-19 తేడాతో, కరీంనగర్ జట్టు మెదక్‌పై 13-01, రంగారెడ్డి జట్టు ఆదిలాబాద్‌పై 25-09 తేడాతో గెలుపొందాయి.

ధాన్యం క్రయవిక్రయాలు

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం వరి ధాన్యం విక్రయానికి వచ్చింది. వడ్లు సోన రకం 1795.80 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ట ధర రూ.2,420, కనిష్ట ధర రూ. 2,011, రమారమిగా రూ. 2,311 పలికింది. వడ్లు హంస రకం 166.80 క్వింటాల్ విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ట ధర రూ. 2850, కనిష్ట ధర రూ. 1,869, రమారమి ధర రూ. 1,869 పలికింది.

ఎన్యుమరేటర్లకు సెలవు లేదు

నారాయణపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే సందర్భంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం, ఆదివారం ఎన్యుమరేటర్లకు సెలవు లేదని అందరూ తమ మండల అధికారులకు రిపోర్ట్ చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎన్యుమరేటర్లు సర్వేకు హాజరై పూర్తిచేయాలని ఆదేశించారు.

మాతా మాణికేశ్వరీ ఆలయంలో నేడు పూజలు

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట శివారు పగిడిమర్రి మార్గంలో వీరధర్మజ మాతా మాణికేశ్వరీ ఆలయంలో శనివారం ఆరవ వార్షికోత్సవం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాదుక పూజ, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

టెంకాయల విక్రయానికి వేలం

కొల్లాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సింగోటం గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కొబ్బరి కాయలు, కొబ్బరి చిప్పల విక్రయానికి టెండర్లు నిర్వహించారు. జనవరిలో జరిగే శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా టెండర్లు నిర్వహించినట్లు డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి, ఆలయ ఈవో రంగారావు, జైపాల్‌రెడ్డి తెలిపారు. సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. బహిరంగ వేలంలో గత సంవత్సరం టెండర్లకు అనువుగా రాకపోవడంతో సీల్డ్ టెండర్లు నిర్వహించారు. కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు కోసం రూ.25 లక్షలు, కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కు కోసం రూ.లక్ష 50వేలకు అరుణ్ దక్కించుకున్నారు. జనవరి 1వ తేదీ 2025 నుంచి డిసెంబరు 31 వరకు టెండర్ దారుడు హక్కు కలిగి ఉంటారని తెలిపారు. నాణ్యమైన పెద్ద సైజులో టెంకాయలు అమ్మాలని, భక్తులకు ఇబ్బంది కలగకుండా టెండర్ దారుడు చూసుకోవాలని తెలిపారు. ఇరు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, స్వామి రథోత్సవం కనుల పండువగా జరుగుతుందని తెలిపారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి



విద్య కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేష్‌ను కలిసిన గెస్ట్ లెక్చరర్స్ సంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ సదానందంగౌడ్

కల్వకుర్తిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యావ్యవస్థను అభివృద్ధి చేయాలని గెస్టు లెక్చరర్స్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదానందం గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేష్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి మాట్లాడారు. విద్యావ్యవస్థలో వెనుకబడిన కల్వకుర్తి ప్రాంతం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అధిక నిధులు వచ్చేలా కృషి చేయాలని కోరినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాలస్వామిగౌడ్, గెస్టు లెక్చరర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు కావలి కృష్ణ, కోశాధికారి భీమేశ్వర్, ఉపాధ్యక్షుడు బాలరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలికకు తీవ్ర గాయాలు

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మెయిన్‌రోడ్‌లో శుక్రవారం పెట్రోల్ బంక్ దగ్గర వేగంగా వచ్చిన జీపు అదుపుతప్పి అశోక్‌నగర్‌లో తమ ఇంటి నుంచి సైకిల్‌పై స్కూల్‌కు వెళ్తున్న అరవ తరగతి విద్యార్థిని కీర్తనను ఢీ కొట్టింది. దాంతో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాలికను జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు బాలిక తలకు ఆరు కుట్లు వేశారు. తల భాగం కావడంతో విద్యార్థినికి మెరుగైన వైద్యసేవల కోసం మహబూబ్‌నగర్‌కు తరలించేలా రవి తేజ పాఠశాల యజమాన్యం తక్షణ చర్యలు తీసుకొని ఆర్థిక సహాయం అందించారు.

పత్తి లోడ్ డీసీఎం దగ్ధం

కల్వకుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం వేపూర్ సమీపంలో పత్తిలోడ్‌తో వస్తున్న డీసీఎం విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. తాడూరు మండలం సిర్సవాడకు చెందిన రైతు రవీందర్‌రెడ్డి తన పొలంలో పండిన పత్తిని విక్రయించేందుకు డీసీఎంలో నింపుకొని కల్వకుర్తి వైపు వెళ్తుండగా వేపూర్ సమీపంలో విద్యుత్ తీగలకు తగిలి మంటలు అంటుకున్నాయి. చుట్టుపక్కల ఉన్న రైతులు వెంటనే స్పందించి మంటలను ఆర్పేశారు. అప్పటికే 15 క్వింటాళ్ల పత్తి కాలిపోయిందని బాధితుడు తెలిపారు.

సర్వర్ డౌన్

● 60 రోజులు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



వనపర్తి పట్టణంలో భవన నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కార్మికులు



ఇసుక జల్లెడ పడుతున్న మహిళ

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికులు కార్మికశాఖ ద్వారా పొందాల్సిన పథకాలకు దూరమయ్యే దుస్థితి నెలకొంది. వనపర్తి జిల్లాలో 14 మండలాల్లో 48 వేల మంది కార్మికులు కార్మిక శాఖలో సభ్యత్వం తీసుకున్నారు. సెప్టెంబరు మొదటి వారంలో భవన నిర్మాణ కార్మిక రంగ సంస్థలో సర్వర్ బంద్ అయ్యింది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించలేదు. దీంతో తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల పథకాలన్నీ తెలంగాణ భవనం, ఇతర కన్‌స్ట్రక్షన్, వెల్ఫేర్ బోర్డు ఆధారంగా చేసుకుని అమలు అవుతున్నాయి. ఇందులో భాగంగా కార్మికులు సభ్యత్వ నమోదు.. ఇది వరకే నమోదు చేసుకున్న కార్మికులు రెన్యువల్ చేసుకోవడం ఆయా పథకాల కింద పరిహారం ప్రోత్సాహకాలను ఈ సర్వర్ ఆధారంగానే జరుగుతుంటాయి. 60 రోజులుగా సర్వర్ బంద్ కావడంతో జిల్లాలోని కార్మికుల నివేదికలు, ఇతర సమాచారం సైతం తెలుసుకోవడానికి వీలు లేకుండా పోయింది. ప్రమాదవశాత్తు, సహజ మరణం, ప్రసూతి, పెళ్లి కానుక వంటి పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేకుండా అయ్యిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా సభ్యత్వ నమోదు చేసుకోవడం, రెన్యువల్ చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని కార్మికులు వాపోతున్నారు. తక్షణమే నిర్మాణరంగ సర్వర్‌ను ఓపెన్ చేసి కార్మికరంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. జిల్లాలో రెండు కార్యాలయాలు ఉండాల్సి ఉండగా వనపర్తి జిల్లాలో ఒకే కార్యాలయం ఉంది. సరిపడా ఉద్యోగులు లేకపోవడంతో కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఆలస్యం అవుతోందని కార్మికులు వాపోతున్నారు. నిర్మాణ రంగంలో 36 రకాల పనులు చేస్తున్న కార్మికులు సభ్యత్వం కలిగి ఉన్నారు. వీరికి తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ఆయా రకాల సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 300కు పైగా ఉన్నాయి. అలాగే క్లెయిమ్స్ 250కి పైగా పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపిస్తున్నారు. దరఖాస్తు చేసుకుని ఏడాదైనా క్లెయిమ్స్ డబ్బులు వచ్చే పరిస్థితి లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయి..



సర్వర్ బంద్ కావడంతో క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. నవీకరణ నిమిత్తం సర్వర్ బంద్ చేశామని తెలిపారు. ప్రస్తుతం నూతనంగా కార్మికులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

\- వేణుగోపాల్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, వనపర్తి

సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



కల్వకుర్తి పట్టణంలో స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సామాజిక, విద్య, ఉపాధి, ఆర్థిక, కుల వివరాల సేకరణకు చేపడుతున్న సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. కల్వకుర్తి పట్టణంలో ఇంటింటి స్టిక్కరింగ్ పనులను శుక్రవారం పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి సర్వే ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, ఏఈ షబ్బీర్ అహ్మద్ ఉన్నారు.

బాలల హక్కుల రక్షణ కోసం సంతకాల సేకరణ



సంతకం చేస్తున్న గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల న్యూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం గద్వాల కలెక్టరేట్‌లో బాలల హక్కుల పరిరక్షణ కోసం సంతకాల సేకరణ చేపట్టారు. మొదటగా కలెక్టర్ బీఎం.సంతోష్ సంతకం చేశారు. బాలలు చదువుకునేందుకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడం సామాజిక బాధ్యత అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం సమాజంలో ప్రతీఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరు నర్సింగరావు, జడ్పీ సీఈవో కాంతమ్మ, జిల్లా సంక్షేమాధికారి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సాగుకు సన్నద్ధం



వరి సాగుకు పొలం సిద్ధం చేసుకుంటున్న రైతులు (ఫైల్)

మొదటి పేజీ తరువాయి..

సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. వరి 98,355 ఎకరాలు, వేరుశనగ 18,770, మినుములు 12,741, పప్పుశనగ 440, మొక్కజొన్న 496, జొన్న 409, ఇతర పంటలు 665 ఎకరాలలో సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ పంటలకు 20,170 టన్నుల యూరియాతో పాటు డీఏపీ 7,746 టన్నులు, పొటాష్ 4,352 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 13,333 టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్పేట్ 1,843 టన్నులు, మొత్తం 47,444 టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే వేరుశనగ, పప్పుశనగ, మొక్కజొన్న, ఆముదం తదితర పంటలు సాగు చేశారు. డిసెంబరులో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

సాగు పెరిగే అవకాశం ఉంది

వానాకాలం పంటసాగు ఇంకా కోతదశలో ఉంది. యాసంగిలో మేము వేసిన అంచనా కంటే మరింత సాగు పెరిగే అవకాశం ఉంది. రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం. అదేవిధంగా రైతులకు సలహాలు, సూచనలు చేసేందుకు ఏఈవోలు సిద్ధంగా ఉన్నారు.

\- సక్రియనాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, గద్వాల

మొక్కజొన్న సాగు లాభదాయకం



పాలెం కేవీకేలో విత్తనాలు అందజేస్తున్న అధికారులు

బిజినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తూ యాసంగిలో మొక్కజొన్న సాగుతో లాభాలను పొందవచ్చని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని కేవీకేలో శుక్రవారం అఖిల భారత మొక్కజొన్న పరిశోధన సంస్థ, లూథియాన్, మొక్కజొన్న పరిశోధన కేంద్రం రాజేంద్రనగర్ హైదారాబాద్ వారు సంయుక్తంగా నిర్వహించిన దిగుబడినిచ్చే మొక్కజొన్న విత్తనం డీహెచ్‌ఎం-117 రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ ప్రాంత వాతావరణానికి డీహెచ్‌ఎం-117 విత్తనం యాసంగి సీజన్‌లో నాణ్యమైన అధిక దిగుబడి వస్తుందని, గిట్టుబాటు ధర కూడా లభిస్తుందని అన్నారు. మొక్కజొన్న సాగు సరైన యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడులు పొందాలని కోరారు. ఎకరాకు ఎనిమిది కిలోల మొక్కజొన్న విత్తనాని రైతులకు ఉచితంగా ఇచ్చి ప్రోత్సహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సమత పరమేశ్వరి, కేవీకే శాస్త్రవేత్తలు బి.రాజశేఖర్, రామకృష్ణ, ఆదిశంకర్, ఖానాపూర్, పర్వతాపూర్, వసంతాపూర్ తదితర గ్రామాల రైతులు ఉన్నారు.

కొండారెడ్డిపల్లిలో.. ఆధ్యాత్మిక శోభ

\- వైభవంగా విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు
\- పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత, సోదరులు, కలెక్టర్ బదావత్ సంతోష్



స్వామి వారి సన్నిధిలో కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

వంగూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి నూతన ఆలయం, ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠాపన మహోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాలు తిలకించేందుకు ఆడపడుచులు, బంధుమిత్రులు రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠాపన చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, సీఎం కూతురు నైనిషా, అల్లుడు, మనుమడు, సోదరులు ఎనుముల కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామంలో ఆయన సొంత నిధులు రూ.3 కోట్లతో ఆలయ పునఃనిర్మాణం చేశారని అన్నారు. ఈ రోజు ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ముత్యాల లక్ష్మారెడ్డి, వేమారెడ్డి, లాలుయాదవ్, అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

కూలీల కొరతతో నల్లబారుతున్న పత్తి

తాడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలలో కూలీల కొరత పత్తి సాగుచేసిన రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి తీరా పంట చేతికొచ్చే సమయంలో కూలీల కొరత కారణంగా పత్తి పొలంలోనే నల్లబారుతోంది. ఇటీవల 15 రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, నంద్యాల జిల్లాల నుంచి కూలీలు వలస వచ్చి పత్తి తీస్తున్నప్పటికీ కూలీలు సరిపోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి పంట దెబ్బతిన్నది. ఉన్న కాస్త పత్తి తీసుకుందామనుకుంటే కూలీల కొరత వేధిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యాదిరెడ్డిపల్లిలో కూలీల కొరతతో పొలంలోనే నల్లబారుతున్న తెల్ల బంగారం


కురుమూర్తి కొండల నడుమనున్న జాతర మైదానంలో భక్తుల సందడి

గోవిందా.. గోవింద

అంగరంగ వైభవంగా ఉద్దాలోత్సవం

చిన్నచింతకుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాలోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తుల వాహనాలతో రహదారులు నిండిపోయాయి. తెల్లవారు జాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో జాతర మైదానం కిక్కిరిసిపోయింది. గోవింద నామస్మరణతో కురుమూర్తి గురులు మారుమోగాయి. భక్తులు దాసంగాలను సిద్ధం చేసుకొని స్వామి వారికి సమర్పించారు.


ఉద్దాలను తాకేందుకు పోటీ పడుతున్న భక్తులు

పల్లమర్రి నుంచి చాట ఊరేగింపు

స్వామి వారి పాదుకలను తీసుకెళ్లేందుకు వినియోగించే చాటను చిన్నచింతకుంట మండలంలోని పల్లమర్రి గ్రామంలో సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు గ్రామస్థులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చాటకు ప్రత్యేక పూజలు చేశారు. చాటను తలపై పెట్టుకొని ముందు నడువగా, ఊరేగింపు ప్రారంభమైంది. గ్రామంలోని అన్ని ఆలయాలకు చాటను తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం 11 గంటల సమయంలో ఉద్దాల చాటను ట్రాక్టర్‌పైన ఉంచి లాల్‌కోట, నెల్లికొండి, పెద్దవడ్డెమాన్ మీదుగా చిన్నవడ్డెమాన్ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ గ్రామస్థులు, వేలాది మంది మంది భక్తులు చాట ఊరేగింపునకు స్వాగతం పలికారు. ఆ తర్వాత ఉద్దాల తయారీ మండపంలోకి చాటను తీసుకెళ్లగా, ఆనవాయితీ ప్రకారం దళితులు ఉద్దాలను చాటలో ఉంచి పూజలు చేశారు. మధ్యాహ్నం 1.40 గంటల సమయంలో ఉద్దాలను చాటను తయారీ కేంద్రం నుంచి బయటకు తీసుకొచ్చి అక్కడే ఉన్న కట్టపై ఉంచారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు సీతాదయాకర్‌రెడ్డి, ఆమె కుమారులు సిద్ధార్థరెడ్డి, కార్తీక్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, ఉద్దాలను దర్శించుకున్నారు. ఆ తర్వాత ఉద్దాల ఊరేగింపు ప్రారంభమై ఊకచెట్టు వాగు వద్దకు చేరుకున్నది. ఉద్దాలను దర్శించుకునేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులు వాగులో కిలోమీటర్ మేర కూర్చున్నారు. వారి తలల మీదుగా ఉద్దాల ఊరేగింపు ముందుకు సాగింది. అనంతరం ఊరేగింపు తిర్మలాపూర్ గ్రామం, దేవుని చెరువుట్టల మీదుగా సాయంత్రం ఆరు గంటల సమయంలో కురుమూర్తి జాతర మైదానంలోని దశమికట్టకు చేరుకున్నది. దీంతో ఒక్క సారిగా గోవింద నామ స్మరణ మిన్నంటింది. నెమలి కట్టలను చేతిలో పట్టుకొని, బంతిపూల మాలలు వేసుకున్న భక్తులు ఉద్దాలను తాకేందుకు పరుగులు తీశారు. మహిళలు పూనకాలతో స్వామి నామాన్ని స్మరిస్తూ ఊగిపోయారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఆ తర్వాత ఉద్దాలను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగింపును కొనసాగించారు. రాత్రి ఏడు గంటల సమయంలో స్వామి వారి రాజగోపుర ముఖద్వారానికి చేరుకున్నారు. అక్కడ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ఉద్దాలను గుట్టమీదకు తీసుకువెళ్ళి పూజలు చేసి మండపంలో ఉంచారు. వచ్చే బ్రహ్మోత్సవాల వరకు ఉద్దాలనే అక్కడే ఉంచుతారు.

భారీ బందోబస్తు


ఉద్దాలోత్సవం సందర్భంగా పోలీసు శాఖ ఆరు వందల మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ముగ్గురు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 42 మంది ఎస్ఐలు, వంద మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 239 మంది పోలీసులు, 79 మంది మహిళా పోలీసులు, 121 మంది హోంగార్డులు బందోబస్తులో పాల్గొన్నారు. జాతర మైదానంలో వంద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపించింది. దాదాపు మూడు లక్షల మంది భక్తులు ఉత్సవానికి తరలివచ్చినట్లు తెలుస్తోంది.


పల్లమర్రిలో చాటను తలపెట్టుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్


ఎద్దుల బండ్లపై జాతరకు వస్తున్న భక్తులు


చిన్న వడ్డెమాన్‌లో ఉద్దాలను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు


జాతర మైదానంలో జనం సందడి


విద్యుద్దీపాల వెలుగులో జాతర మైదానం


కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు


నెమలి కట్టలను చేత పట్టుకొని పరుగున వస్తున్న భక్తులు


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


బంతిపూల మాలలతో ఉత్సవానికి వచ్చిన భక్తులు


వేంకటేశ్వర స్వామికి దాసంగాలను సమర్పిస్తున్న మహిళలు

కాటమయ్య ఆలయ నిర్మాణానికి భూమిపూజ

» పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్, నవంబరు 8 : మహబూబ్‌నగర్ పట్టణంలోని ఏనుగొండ సాంబశివాలయం సమీపంలో శ్రీకంఠ మహేశ్వర స్వామి (కాటమయ్య) దేవాలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మునిసి పల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీకంఠ మహేశ్వర స్వామి ఆలయంతో పాటు వనం ఎల్లమ్మ కమ్యూనిటీ భవనాన్ని కూడా నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ అందరి సహకారంతో భవ్యమైన దేవాలయం రూపుదిద్దుకోబోతుందన్నారు. ఇందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. పనులను వెంటనే ప్రారంభిస్తున్న తెలిపారు. ఏడాదిలో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నామన్నారు. ఆలయంతో పాటు, కమ్యూనిటీ భవనం అందుబాటులోకి వస్తే గౌడ కులస్తులు వేడుకలు, ఉత్సవాలు జరుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గౌడ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్ల సంఘం నాయకులు సతూ్తరు వెంకట స్వామిగౌడ్, వై రాజయ్య గౌడ్, సాయిలుగౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, చంద్రకుమార్‌గౌడ్, కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములుగౌడ్, సత్య నారాయణ గౌడ్, బాలరాజు గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గుముడాల చక్రవర్తిగౌడ్, రవీందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, కుమార్ గౌడ్, బాలగౌడ్ పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

» యువకుడిపై పోక్సో కేసు నమోదు

గద్వాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలం లోని ఓ గురుకుల పాఠశాలలో విద్యార్థినితో ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. పాఠశాల సిబ్బంది అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ నెల ఆరున జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడ్డేపల్లి మండలం తిమ్మాజిపల్లికి చెందిన ఆంజనేయులు ఏడాది క్రితం వరకు ప్రభుత్వ కళాశాలలో గెస్టు లెక్చరర్‌గా పనిచేశాడు. ఓ అమ్మాయిని ప్రేమించి విఫలమయ్యాడు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఆయన ఉద్యోగం మానేసి గద్వాలలో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో అతడు బుధవారం మండలంలోని ఓ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలోకి వెళ్లి తనకు ఉద్యోగం కావాలని ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు ఇచ్చాడు. ఖాళీలు లేవని చెప్పినప్పటికీ అక్కడి నుంచి కదల లేదు. చివరకు సిబ్బంది గట్టిగా చెప్పడంతో బయటకు వచ్చాడు. అదే సమయంలో లీజర్ బెల్ కావడంతో ఓ విద్యార్థిని వాష్ రూమ్‌కు వెళ్తుండగా అసభ్యంగా ప్రవర్తించాడు. సిబ్బంది వెంటనే అతడిని పట్టుకొని పోలీసులకు అప్ప గించారు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. సున్నితమైన కేసు కావడంతో గోప్యంగా ఉంచామన్నారు.

అనాథగా జీవించలేక ఆత్మహత్య

» రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో ఘటన


బోయ కృష్ణ (ఫైల్)

రాజోలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అనాథగా జీవించలేక పోతున్నానంటూ ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ కృష్ణ (26) తల్లిదండ్రులు నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం తన పెదనాన్న కుమారుడు బోయ అర్జున్‌కు ఫోన్ చేశాడు. తాను అనాథగా బతకలేనని, ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. అయితే కృష్ణ గతంలోనూ పలుమార్లు ఇలాగే చెప్పడంతో ఆయన వెళ్లలేదు. మళ్లీ కాసేపటికి ఫోన్ చేసిన కృష్ణ, తాను పొలంలో ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. తనను చివరిసారి చూసేందుకు రావాలని కోరాడు. దీంతో పొలానికి వెళ్లిన ఆయనకు పురుగుల మందు తాగి నురగలు కక్కుకుంటున్న బోయ కృష్ణ కన్పించాడు. వెంటనే అతడిని చికిత్స కోసం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఏడు గంటల సమయంలో మృతి చెందాడు. పెదనాన్న కుమారుడు అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మృతదేహంపై ఆభరణాలు మాయం

» పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

గద్వాల క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ఆసుపత్రి మార్చురీలో ఉన్న మహిళ మృతదేహం పైనున్న బంగారు ఆభరణాలు మాయం అయ్యాయి. మృతురాలి కుటుంబ సభ్యురాలు భారతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని రింగ్ రోడ్డు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోనుపాడుకు చెందిన శేషమ్మ మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదికి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులు తీసుకెళ్లే సమయంలో పరిశీలించగా బంగారు పుస్తెలు, నాలుగు గుండ్లతో పాటు ముక్కు పుడక కన్పించలేదు. మొత్తంగా తులంన్నర బంగారం మాయం అయినట్లు గుర్తించారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించగా, మీరే వచ్చి పోయారు కాబట్టి మీరే తీసి ఉంటారని బుకాయించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మానవ విలువలతో కూడిన విద్య అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మానవ విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర జడ్పీహెచ్ఎస్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు తిప్ప రామ్మూర్తి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ కార్య క్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాల కిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి సీఎస్ఆర్ మాదిరిగానే ఏఎస్ఆర్ కూడా అవసరమని అన్నారు. ఏఎస్ఆర్ అంటే అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అన్నారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు ?

గద్వాల, నవంబరు 8 (అంధ్రజ్యోతి) : ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన నిందితుడిని గద్వాల పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గద్వాల మండలం వెంకంపేట గ్రామానికి చెందిన యువరాజు ఆరు నెలల క్రితం వైద్య ఆరోగ్యశాఖలో సూపర్‌వైజర్ పోస్టులు ఉన్నాయని పలువురు నిరుద్యోగులను నమ్మించాడు. వారి నుంచి మొత్తం మూడు లక్షల రూపాయల వరకు వసూలు చేశాడు. కానీ వారికి ఉద్యోగాలు రాలేదు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు గత నెల 29వ తేదీన రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. గద్వాల శివారులో శుక్రవారం అనమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని చెప్పడం గమనార్హం.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ పట్టణంలోని టీడీగుట్ట సమీపంలోని రైలు పట్టాలపై శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. తల రైలు పట్టాలపై పెట్టి పడుకోవడంతో మొండెం నుంచి వేరైంది. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, మృదేహాన్ని రైల్వే పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మక్తల్/ ఊట్కూరు/ నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని కర్ని ఉన్నత పాఠశాల విద్యార్థిని రవళిక ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. నాగర్‌కర్నూల్ జిల్లా తాండ్ర జడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల ఏడున నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థిని రవళిక పాల్గొని ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వెంకటయ్యగౌడ్, పీడీ రూప తెలిపారు. ఈ నెల తొమ్మిది నుంచి 11 గంటల వరకు ఖమ్మంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో కర్ని పాఠశాల నుంచి 40 మంది బాలబాలికలు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

- ఉట్కూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి క్రిష్ నాయక్ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ - 17 రగ్బీ బాలుర పోటీలకు ఎంపికయ్యాడు. నవంబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న పోటీల్లో క్రిష్ పాల్గొననున్నట్లు జీహెచ్‌ఎం కుమార్‌రెడ్డి, పీడీ సాయినాథ్ తెలిపారు. వారితో పాటు ఉపాధ్యాయులు మరళి, సురేశ్, మహేశ్ విద్యార్థిని అభినందించారు.

ఇంటర్వ్యూ..



నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు

- మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్

కొల్లాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ వారికి సలహాలు, సూచనలు చేస్తున్నారు. పంటలపై సోకుతున్న చీడపీడల నివారణకు జాగ్రత్తలు సూచిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ యాదవ్‌తో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ విశేషాలు..

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు ఎలా?

రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పెస్టిసైడ్స్ విక్రయిస్తే పీడీ యాక్టు కేసులు నమోదవుతాయి. మండలంలోని ఎరువుల, పెస్టిసైడ్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, నకిలీలను గుర్తిస్తాం. నకిలీ తేలితే చర్యలు తప్పక ఉంటాయి.

వర్షాలతో నష్టపోయిన పంటలకు పరిహారం అందించారా?

కొల్లాపూర్ మండలంలో మూడు నెలల క్రితం కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో తిరిగి గుర్తించాం. మండలంలో 392 ఎకరాలలో 629 మంది రైతులకు సంబంధించి, పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. 15 రోజుల క్రితమే ఎకరాకు రూ.పదివేల చొప్పున పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది.

కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లో ఎంత మందికి రైతు రుణమాఫీ అయింది.

కొల్లాపూర్ మండలంలో 7,612 మంది రైతులకు రూ. 57 కోట్ల 28 లక్షలు, పెంట్లవెల్లి మండలంలో 2,348 మంది రైతులకు రూ27 కోట్ల 31 లక్షల రైతు రుణమాఫీ అయింది.

మండలంలో ఏ పంటలు అధికంగా ఉంటాయి.

కొల్లాపూర్ మండలంలో ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతులు వరి పంటలను ఎక్కువగా వేస్తారు. దాదాపు 8 వేల ఎకరాల వరి మండలంలో సాగు అవుతుంది. యాసంగిలో మొక్కజొన్న, మినుములు కూడా రైతులు సాగు చేస్తారు. నాతో పాటు ఏఈవోలు ప్రతీ రోజు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శించి రైతుల సమస్యలను గుర్తించి చీడపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నాం. గ్రామాల్లో రైతు వేదికలను అపరిశుభ్రం చేస్తున్నారు. కొందరు ఆకతాయిలు తలుపులు, కిటికీలు ధ్వంసం చేస్తున్నారు.

క్రైం కార్నర్

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

- తప్పిన భారీ ప్రమాదం

కల్వకుర్తిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలిండర్‌పేలి ఇల్లు ధ్వంసమైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ ఖలీల్‌రహమాన్‌కు రెండు రోజుల క్రితం సిలిండర్ రాగా, ఇంట్లో వాడకుండా అలాగేపెట్టాడు. అర్ధరాత్రి సమయంలో సిలిండర్ నుంచి పొగలు, మంటలు రావడంతో కుటుంబ సభ్యులు గమనించి ఇంట్లో నుంచి బయటికి రావడంతో ప్రాణాలతో బయటపడినట్లు వారు వివరించారు. వెంటనే మంటలు చెలరేగి సిలిండర్ పేలిందని, దీంతో ఇంట్లోని గోడ, ఇతర సామగ్రి దెబ్బతిన్నదని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సమాచారం ఇచ్చిన వారు వచ్చేసరికి నష్టం జరిగిందని కాలనీవారు అన్నారు.

బావిలో జారిపడి యువతి మృతి

అచ్చంపేటటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బావిలో కాలుజారి పడి యువతి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని ఐనోల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన నేనావత్ దర్యా, లక్ష్మిల రెండవ కూతురు సకిత (19) ఇంటర్ మొదటి సంవత్సరం వరకు చదవి ఇంటి దగ్గరే మేకలు కాస్తుంది. శుక్రవారం మేకలు మేపడానికి వెళ్లింది. పొలం పక్కన ఉన్న బావిలో దిగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడింది. చుట్టు పక్కల వారు యువతి కోసం వెతకగా బావిలో ఆమె టవల్ కనిపించడంతో బావిలో పడినట్లు భావించారన్నారు. బావిలో నీటిని తోడి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు తండ్రి ఫిర్యాదుమేరకు సిద్దాపూర్ ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కానిస్టేబుల్ ఫిర్యాదు

తిమ్మాజిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తనను గాయపర్చి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శరత్‌గౌడ్ శుక్రవారం ఎస్ఐ నరేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. నాగర్‌కర్నూల్‌లో కోర్టు విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా తిమ్మాజిపేట శివారులోని బావాజీపల్లి గ్రామానికి చెందిన నాగయ్య అనే వ్యక్తి మద్యం సేవించి దుర్భాషలాడాడని, నెట్టి పారిపోయాడని కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కల్వకుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లాలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. భారీ కేకులు కట్ చేసి పంచిపెట్టారు. కల్వకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బ్యంగి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలిసి బ్యంగి ఆనంద్ కుమార్ కేక్ కట్ చేసి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తుందని పేర్కొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి ఉన్నారు.

సీఎం సతీమణికి ముక్కుపుడక అందజేత

పదర : ఇటీవల దసరా పండుగ సందర్భంగా మండల కేంద్రంలో దుర్గామాత సన్నిధిలో వేలంలో రూ.8 లక్షల 10 వేలకు ముక్కుపుడక దక్కించుకున్న బూరం సురేష్ యాదవ్ శుక్రవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డికి అందజేసినట్లు తెలిపారు. ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారి అర్చన కుంకుమను ఆమెకు అందజేసినట్లు తెలిపారు. సీఎం కుటుంబ సభ్యులు ఎనుముల జగదీష్ రెడ్డి, కృష్ణారెడ్డి, కొండల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కాశన్న యాదవ్ అన్నారు.

కొల్లాపూర్‌లో...

కొల్లాపూర్ : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కొల్లాపూర్‌లోని శ్రీవాణి విద్యానికేతన్‌లో పీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు నిర్వహించారు. చిన్నారులకు స్వీట్స్, చాక్లెట్స్ పంపిణీ చేశారు. వీరస్వామి, అహ్మద్‌ఖాన్, జావేద్, జుబేర్ పాల్గొన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి : కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటస్వామి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి, బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, ఆదివాసీ రాష్ట్ర కార్యదర్శి వాల్యానాయక్, మస్కూరి అవంతి శంకర్, హరీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి తిరుపతయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందు నాయక్, చంద్రగౌడ్, బాలపీరు పాల్గొన్నారు.

నల్లమలలో..

మన్ననూర్ : అమ్రాబాద్ మండలం మన్ననూరులోని శ్రీశైలం, హైదరాబాద్ ప్రధాన రహదారిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు కేకును కోసి సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కోఆ ప్షన్ మాజీ సభ్యుడు రహీం, ఎంపీటీసీ మాజీ స భ్యులు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, కాంగ్రెస్ నాయకులు తుల్స్యా నాయక్, సంభు వెంకట్ రమణ, పెర్ముల వెంకటేశ్వర్లు, రాజారాం, రాజేం ద్రప్రసాద్, బుచ్చయ్య, లోకనాథం పాల్గొన్నారు.

● దోమలపెంట : అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ చత్రు నాయక్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒక మొక్కను నాటారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంబాబు, కాంగ్రెస్ నాయకులు పాండయ్య, సరియా నాయక్, సాదిక్, బలరాం, రమేష్ పాల్గొన్నారు.

● అమ్రాబాద్ : మండల కేంద్రమైన అమ్రాబాద్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేకును కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి. ఖైరత్, కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్యగౌడ్, తిరుమలయ్య, అశోక్, మహబూబ్ అలి, జగన్ పాల్గొన్నారు.

● లింగాల : లింగాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం చిత్ర పటం ఉంచి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

● తెలకపల్లి : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి బాణసంచా పేలుస్తూ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మీ పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్యంగి ఆనంద్‌కుమార్, నాయకులు

పాములు వస్తే చంపొద్దు.. సమాచారం ఇవ్వండి

- ఫారెస్ట్ అధికారి సుమన్


పామును పట్టుకున్న ఫారెస్టు అధికారి

అచ్చంపేటటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాలనీలలోకి, ఇళ్లలోకి పాములు వస్తే చంపొద్దని, సమాచారం ఇస్తే తామే వచ్చి పట్టుకొని అడవిలో వదులుతామని ఫారెస్ట్ అధికారి సుమన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని న్యూ వెంకటేశ్వర కాలనీలో ఇళ్ల మధ్యలోకి భారీగా ఉన్న పాము వచ్చింది. వెంటనే కాలనీవాసులు మహేష్ ఫారెస్టు అధికారి సుమన్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చి పామును బంధించాడు. పట్టుకున్న పామును ఫారెస్టులో వదిలారు. ఆయన మాట్లాడుతూ పాములు విషపూరితమైనా వాటికి భయం ఎక్కువేనన్నారు. ఇళ్ల మధ్యకు వస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు.

గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-3 పరీక్షా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 17, 18తేదీలలో జరగబోయే గ్రూప్ -3 పరీక్షకు సంబంధించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రూప్-3 పరీక్ష కోసం 33 సెంటర్లు ఏర్పాటు చేసి నట్లు 9478 మంది అభ్యర్థులు పరీక్ష రాయబోతున్నట్లు తెలిపారు. ఈ సమా వేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, రీజినల్ కో ఆర్డినేటర్ మధుసూదన్‌శర్మ, డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి, ఆర్డీవో సురేష్, తహసీల్దార్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెం డెంట్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర అందించాలి : కలెక్టర్

కల్వకుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మద్దతు ధర అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని శ్రీ బాలాజీ కాటన్ మిల్లును ఆకస్మికంగా సందర్శించి యంత్రాలను పరిశీలించి జిన్నింగ్ మిల్లు యజమానిని పత్తి కొనుగోళ్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతు ధర అందించడం కోసం జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలకు నిర్ణీత తేమ శాతం ఉన్న పత్తిని తీసుకొచ్చి రైతులు మద్దతు ధర పొందాలని కలెక్టర్ తెలిపారు. 8 వరకు తేమ శాతంఉన్న పత్తికి రూ.7521, 9 శాతం తేమ ఉన్న పత్తికి రూ.7445 క్వింటాల్‌కు చెల్లించనున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీసీఐ కమర్షియల్ ఆఫీసర్ రమేష్, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, మార్కెటింగ్ ఆఫీసర్ స్వరణ్‌సింగ్, మిల్లు యాజమాని మర్రి ప్రీతంరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ బడ్జెట్ రికార్డు నిర్వహణపై సమీక్ష

- ఏడీఆర్‌డీవో రాజేశ్వరి


సమీక్షలో మాట్లాడుతున్న ఏడీఆర్‌డీవో రాజేశ్వరి

కందనూలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ క్లస్టర్‌లోని ఐదు మండలాల ఎంపీడీవో, ఏపీవోలు, ఈసీలు, సాంకేతిక సహాయకులు, ఎఫ్ఏలు గ్రామాలలో ఉపాధి కూలీలకు చేపట్టాల్సిన పనులు, నర్సరీలు, బడ్జెట్ తయారీ రికార్డుల నిర్వహ ణలపై రివ్యూమీటింగ్ అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రాజేశ్వరి శుక్రవారం నాగర్‌కర్నూల్ ఎంపీడీవో ఆఫీస్‌లో రివ్యూ నిర్వహించారు. నాగర్ కర్నూల్, తెలకపల్లి, తాడూరు, తిమ్మాజిపేట, బిజినేపల్లి మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు, ఏపీవోలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులకు వివిధ మండలాల్లో చేపట్టాల్సిన పనులు, ఉపాధి హామీ కూలీలు చేసేందుకు కావాల్సిన లేబర్, బడ్జెట్, నర్సరీల నిర్వహణ, రికార్డుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, ఏపీడీ శ్రీనివాస్, క్లస్టర్ టీఏ రాజేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరిపించొద్దు

- సీడీపీవో వెంకటరమణమ్మ

కోడేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు జరిపించవద్దని ఐసీడీఎస్ కొల్లాపూర్ ప్రాజెక్టు సీడీపీవో వెంకటరమణమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బాడుగదిన్నె గ్రా మంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలు వాటిని సద్వినియోగం చేసుకోవడం కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పుట్టపాక సునీత మాట్లాడుతూ గృహ హింస నుంచి బాధపడుతున్న మహిళలు సఖి కేంద్రం ద్వారా ఉచితంగా న్యాయం పొందవచ్చని ఆమె అన్నారు. గ్రామాలలో బాల్య వివాహాలు జరిపించడానికి ఎవరైనా సన్నాహాలు చేస్తుంటే 1098కి ఫోన్ చేయాలని అన్నారు. మూడేళ్ల పిల్లలని అంగన్‌వాడీ సెంటర్లకు పంపాలని తెలిపారు. కార్యక్ర మంలో మహిళా సంఘం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం సేకరిస్తాం

- సింగిల్ విండో వైస్ చైర్మన్ మల్లేపల్లి వెంకట్‌రెడ్డి



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్ విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

తాడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని సేకరిస్తామని సింగిల్ విండో వైస్ చైర్మన్ మల్లేపల్లి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎట్టిధార్ పల్లిలోని పీ ఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు విష్ణువర్ధన్‌రెడ్డి, రామన్ గౌడ్, పెద్ద రాములు, రామచంద్రయ్యగౌడ్, అర్జున్, జయరాములు, మల్లేష్, శివ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వెల్దండ : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకుని వచ్చి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రాములునాయక్, వీవో అధ్యక్షురాలు దానమ్మ, కార్యదర్శి అంజనమ్మ, రాములు, సీసీ పాండు ఉన్నారు.

అర్హులైన యువత ఓటు నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దారు జనుంపల్లి శ్రీరాములు

బిజినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 9, 10 తేదీల్లో ఓటరు క్యాంపెయిన్ డేలో భాగంగా నూతన ఓటరు నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు తహసీల్దారు జనుంపల్లి శ్రీరాములు శుక్రవారం తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2025, జనవరి 1 వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఫారం 6 ద్వారా కొత్త ఓటు నమోదు చేసుకోవచ్చని అన్నారు. అలాగే ఫారం 7 సమర్పించి ఓటరు తొలగింపు, ఫారంతో ఓటరు నమోదులోని తప్పులను సరి చేసుకోవచ్చని తెలిపారు. వయోజనులై, ఓటరు నమోదు అర్హత ఉన్న ప్రతీ ఒక్కరు ఓటుహక్కు నమోదు చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. నాయబ్ తహసీల్దారు చిక్కుడు రవి కుమార్, సిబ్బంది రాఘవేందర్ ఉన్నారు.

న్యూస్ బాక్స్

సహకార సంఘం ద్వారా రైతుకు ట్రాక్టర్ పంపిణీ

ఉప్పునుంతల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొరటికల్ గ్రామానికి చెందిన సంఘం సభ్యుడు వీరారెడ్డి రైతుకు 12 లక్షల రూపాయలతో ట్రాక్టర్ లోన్ మంజూరు చేయడం జరిగిందని సింగిల్‌విండో చైర్మన్ భూపాల్ రావు, తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాక్టర్ చైర్మన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంఘం సీఈవో రవీంద్రారావు, డైరెక్టర్లు సాయిబాబు, రవీంద్రారావు, బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీ కులగణనను వ్యతిరేకిస్తే ద్రోహులే

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీ కుల గణను వ్యతిరేకించే పార్టీలన్నీ బీసీ ద్రోహులేని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభమైన బీసీ కుల గణనలో అన్ని రాజకీయ పార్టీలు భాగస్వామ్యమై సహరించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కుల గణన ప్రారంభమైనా బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిలు ఎన్ని రోజులు మౌనంగా ఉంటారని ప్రశ్నించారు. బీసీ కులగణపై కాంగ్రెస్ పార్టీలాగే బీఆర్ఎస్, బీజేపీలు అనుకూలమా, వ్యతిరేకమా తమ వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే సహకారంతో రోడ్డుకు మరమ్మతులు

చారకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు ప్రధాన రాహదారి పూర్తిగా గుంతల మయం కావడంతో ప్రయాణికులకు, వాహనాలకు ఇబ్బంది కలుగకుండా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో శుక్రవారం గుంతల మయంగా మారిన రోడ్డుకు తారు వేసి మరమ్మత్తులు చేపట్టడం జరిగిందని అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్‌లు అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గ్యార లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గణేష్‌గౌడ్, మండల మైనార్టీ అధ్యక్షుడు సత్తార్, కందికంటి శ్రీనయ్యగౌడ్, యాదగిరిగౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగం హక్కులను ఉపయోగించుకోవాలి'

ఉప్పునుంతల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులను ఉపయోగించుకోవాలని మానవ హక్కుల మండలి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనయ్య అన్నారు. శుక్రవారం ఉప్పునుంతలలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మొగులాల్‌ను, తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ కేశవను కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సమాజంలో ప్రతీ ఒక్కరు తమ విధులను సక్రమంగా పాటించినప్పుడే హక్కులు పొందగలుగుతారన్నారు. నేటి సమాజంలో అంతరించిపోతున్న మానవ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలు సాయిలు, కన్వీనర్ మేకల శేఖర్, సెక్రటరీ ప్రకాష్ ఉన్నారు.

రామాలయంలో కార్తీకమాస దీపారాధన


వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

కందనూలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రతీరోజు కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. ఉదయం వేళ పరమశివునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నామని, సాయంత్రం సామూహిక దీపారాధనలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

63 రోజులుగా శ్రీసత్యసాయి వ్రతాలు

కందనూలు :భగవాన్ శ్రీసత్యసాయి బాబా 99వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటింటా శ్రీ సత్యసాయి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ హకీం విశ్వప్రసాద్ తెలిపారు. శుక్రవారం నాటికి 63రోజులుగా శ్రీసత్యసాయి వ్రతాలు కోరిన భక్తుల ఇళ్లల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సత్యసాయి మందిరం ఆలయ ప్రధాన అర్చకుడు వావిలాల రాజశేఖరశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య గణపతి పూజా అనంతరం శ్రీసాయి కథలను వివరిస్తున్నట్లు తెలిపారు. సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్టు ప్రధాన కార్య దర్శి ఎలిమే ఈశ్వరయ్య, సువర్ణ, సాయిగీత, శారద, సతీష్, సాయిబాబు, పాండురంగ, రంగారెడ్డి, ప్రసాద్, తులసీరాం, కృష్ణయ్య, వెంకట్రావు, రంగారావు, భక్తులు పాల్గొన్నారు.


రామాలయంలో దీపారాధన నిర్వహిస్తున్న భక్తులు

హనుమాన్ దేవాలయ శిఖర ప్రతిష్ఠాపన

చారకొండ : మండల పరిధిలోని తిమ్మాయిపల్లిలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయానికి గ్రామానికి చెందిన లయోల, శ్రీ ఇందు విద్యాసంస్థల అధినేత రంగినేని వెంకట్‌రావు హనుమాన్ ఆలయ నిర్మాణాని రూ. 30 లక్షలు విరాళం అందజేశారని ఆలయ నిర్వాహకులు సుందర్‌రావు, భాస్కర్‌రావులు తెలిపారు. శుక్రవారం నిర్వాహకుల ఆధ్వర్యంలో దేవాలయంలో శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత రంగినేని వెంకట్‌రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను గ్రామస్థులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీపతిరావు, జైపాల్, కమలాకర్ రావు, రాజేష్‌గౌడ్, తిరుమలేష్, కొండలు, భక్తులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కొల్లాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలలో పని చేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని మునిసిపాలిటీ కార్యాలయ ఆవరణంలో వెంకటరమణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ దశాబ్దాల నుంచి మునిసిపాలిటీలలో కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ పేరుతో కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశర థం, మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ


విద్యార్థులతో మాట్లాడుతున్న బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ ఫీజు రీఎంబర్స్‌మెంటు వెంటనే విడుదల చేయాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీకళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబు, నాయకులు లక్ష్మణ్, నరేష్, మధు, దేవేందర్, పవన్, కార్తీక్, బాలరాజు, రమేష్, మున్నా పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల పరామర్శ

తెలకపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌరెడ్డిపల్లి గ్రామమైన ఎస్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్ రెడ్డి తల్లి ఎం.కౌసల్య మృతి చెందారు. శుక్రవారం సీపీఐ నాయకులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, సీపీఐ జిల్లా కౌన్సిల్ మెంబరు సూర్యశంకర్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

తిమ్మాజిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని మరికల్, తిమ్మాజిపేట, కోడుపర్తి, గొరిట గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ఏపీఎం శ్రీహరి ప్రారంభించారు. సీసీలు వెంకటేశ్వరమ్మ, తిరుపతమ్మ, ఆయా గ్రామాల గ్రామ సంఘాల అధ్యక్షురాలు సరస్వతి, కళావతి, తిమ్మాజిపేట, మహిళా సంఘాల కార్యదర్శి నూర్జహాన్, కళావతి, సుమలత ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతో కందిలో అధిక దిగుబడి

మన్ననూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సస్యరక్షణ చర్యలు పాటిస్తే కంది పంటలో అధిక దిగుబడిని సాధించవచ్చని మండల వ్యవసాయ విస్తరణాధికారి సీతారాం నాయక్ తెలిపారు. అమ్రాబాద్ మండల పరిధిలోని ప్రశాంత్ నగర్ రైతులు సాగు చేస్తున్న కంది చేలలో శుక్రవారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కంది పంటకు కాయ తొలుచు పురుగు ఉధృతిని పరిశీలించారు. ఈ పురుగు కాయలకు రంధ్రం చేసుకొని లోపల ఉన్న గింజలను నాశనం చేస్తుందన్నారు. ఈ పురుగు నివారణకు వాడాల్సిన మందులు, వాటిని, ఎలా, ఎంత మోతాదులో వాడాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆర్ వెంకటయ్య, ఎం.డి. అజ్మత్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పెంట్లవెల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే మనుషులు ఆరోగ్యంగా ఉంటారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కిశోర్ అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా మల్లేశ్వరం, మంచాలకట్ట గ్రామాలలో ఇంటింటికి తిరిగి జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. అదే విధంగా కాచి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. దోమకాటు వల్ల డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి రోగాలు సంభవిస్తాయని అన్నారు. ఇంటి ఆవరణలో సంపు గుంతలు, అదే విధంగా పడేసిన గ్లాసులు, కొబ్బరి బొండాలు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది రామ్మోహన్, దివాకర్, సరళ పాల్గొన్నారు.